క్లుప్తంగా

రేపు మండల సర్వసభ్య సమావేశం

చెరుకుపల్లి: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఈ నెల 16వ తేదీ బుధవారం మధ్యాహ్నం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ మహబుబ్ సుభాని చెప్పారు. ఈ సమావేశంలో మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చింటం జరుగుతుందని, మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలి

రేపల్లె రూరల్: పట్టణంలో మురుగుకాల్వలపై, రోడ్డుకు ఇరువైపుల ప్రాంతాలను ఆక్రమించుకుని వ్యాపారాలు చేసేవారు స్వచ్ఛందంగా తమ ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. మురుగుకాల్వలలోని పూడికలు తీసేందుకు తీవ్ర ఆటంకాలు ఎదురవుతున్నాయని, అదేవిధంగా రహదారికి ఇరువైపు ఆక్రమణలను చేసి వ్యాపారాలు చేసేవారితో ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించకుంటే మున్సిపాలిటీ వారు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని హెచ్చరించారు.

ప్రతిష్టా మహోత్సవాలు ప్రారంభం



కర్లపాలెం: దుండివారిపాలెంలో అభయ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా సోమవారం విఘ్నేశ్వర పూజ, మంగళస్నానం, విశేష పూజలు నిర్వహించి స్వామివారి విగ్రహానికి గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం జలాదివాసం, వాస్తు హోమం, వాస్తు బలి, దిశ హోమం, పూజా హారతి, పూజలు నిర్వహిస్తారు. బుధవారం ఉదయం 7.55నిలకు స్వర్ణ వెంకట శ్రీనివాస శర్మ బృందంచే అభయ ఆంజనేయస్వామి వారి ఏకశిలా విగ్రహాన్ని ప్రతిష్టిస్తారు. అనంతరం మహాన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



తెనాలిఅర్బన్: అల్పపీడనం ప్రభావంగా తెనాలి పట్టణంలో రెండు రోజుల నుంచి వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సోమవారం సూచించారు. మరో రెండు మూడు రోజులు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో ప్రభుత్వం అధికారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. పట్టణంలో ఎటువంటి అనుకుని సంఘటనలు జరిగిన వెంటనే తమకు తెలియజేయాలన్నారు. మున్సిపల్ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారని వివరించారు.

బ్రహ్మోత్సవాల్లో తెనాలి చిన్నారుల నృత్యం



తెనాలి: టీటీడీ నిర్వహణలో అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఘనంగా జరిగిన తిరుమల 'శ్రీవారి' బ్రహ్మోత్సవాల్లో పట్టణానికి చెందిన ప్రముఖ కూచిపూడి యువనర్తకి ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య శిష్యబృందానికి నాట్యం చేసే అవకాశం లభించింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో 12వ తేదీ రాత్రి తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో కూచిపూడి నృత్యప్రదర్శన చేశారు. అన్నమాచార్య కీర్తనలకు తెనాలి చిన్నారులు కూచిపూడి సంప్రదాయరీతిలో లయబద్ధంగా నర్తించారు. అన్నమాచార్య ప్రాజెక్టు అధికారుల అభినందనలను అందుకున్నారు. అనంతరం ప్రాజెక్టు అధికారులు నృత్యగురువు తేజస్విప్రఖ్య, ఆమె శిష్యబృందానికి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

తెరిపివ్వని వర్షం



తెనాలిఅర్బన్: అల్పపీడనం ప్రభావం కారణంగా పట్టణంలో సోమవారం ఎడతెరపి లేని వర్షం కురుస్తూ ఉంది. తెల్లవారుజాము నుంచి చిరుజల్లులు పడుతూ వచ్చాయి. అప్పుడప్పుడు వర్షం నిలిచిన కొద్ది సమయానికే మరలా చిరుజల్లులు పడుతూ వచ్చాయి. దీంతో ప్రజలు కొంత ఇబ్బందులు పడ్డారు.

ముసురుకున్న ఆందోళన!

- తాజా వర్షాలతో మాగాణి రైతుల్లో భయం..భయం
- వరిలో తాలుగింజలు పెరిగే అవకాశం
- పక్వానికి వచ్చే స్థితిలో పంట నాశనం అయ్యే ప్రమాదం



భట్టిప్రోలు-తెనాలి రహదారిలో పక్వానికి వచ్చిన వరి పైరు



భట్టిప్రోలు-తెనాలి రహదారిలో నేల వాలిన వరి పైరు

భట్టిప్రోలు: ఆరుగాలం కష్టపడి ఎన్నో వ్యయప్రయాసల కోర్చి పండిచిన పంట పక్వానికి వచ్చే తరుణంలో అల్పపీడనాలు ప్రభావంతో వర్షాలు మాగాణి రైతులను భయపెడుతున్నాయి. ఈ ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కోలుకోలేని దెబ్బ తీశాయి. ఈ నేపథ్యంలో ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న అల్పపీడనం ప్రభావంతో ఆదివారం నుంచి వాతావరణంలో మార్పు చోటు చేసుకుంది. పంట చేతికి వచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యాలు రైతులను వెన్నాడుతున్నాయి. అల్పపీడన ప్రభావంతో వర్షాలు వాయుగుండాలు, తుఫానుల ప్రభావం అంతగా లేవనుకుంటున్న తరుణంలో క్షణాల్లో చోటు చేసుకున్న మార్పులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతాంగం పంట చేతికివచ్చే దశలో ఉన్న వరిని వర్షం బారిన పడకుండా ఎలా కాపాడాలో అర్థం కాక ఆందోళన చెందుతుంది. ఈ సంవత్సరంలో పంటలు బాగా పండుతాయని భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకుని, గింజల బరువుతో తలలు వంచిన కంకులు చూసుకుంటూ, దిగుబడులు లెక్క పెట్టుకుంటున్న రైతాంగం ఆకాశంలో కమ్ముకున్న మబ్బులను చూసి ఆందోళన చెందుతుంది. వర్షాల వల్ల తాలు ఎక్కువయ్యే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు. వర్షాల కారణంగా పైరుకు మానుగాయ ప్రమాదం ఉందని, నేల వాలిన పైరు కారణంగా దిగుబడులు తగ్గుతాయని రైతులు వాపోతున్నారు. ఈ కారు మబ్బులు ఇంతటితో పోతే బాగుంటుందని రైతులు దేవుడిని వేడుకుంటున్నారు. భట్టిప్రోలు మండలంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 15 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఐతే ముదురు పైర్లు చేతికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయి. మరో కొద్ది రోజుల్లో లేత పైర్లు పక్వానికి రానున్నాయి.

దిగాలు పడుతున్న అన్నదాత

పంట చేతికి అందే సమయంలో వరి పైరు చాపలా పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కంటికి రెప్పలా కాపాడుకున్న వరి పైరు కళ్ల ఎదుటే నేలకు ఒరగడంతో రైతులు దిగాలు పడుతున్నారు. ఆరుగాలం శ్రమించి చెమటోర్చి పండించిన పంట చేతికందే తరుణంలో అల్ప పీడనం ప్రభావంతో కురిసిన వర్షానికి వరి పంట పడకేసింది. వర్షం కారణంగా చేతికి వచ్చిన పంట నేలకొరగడంతో ఏమి చేయాలో పాలుపోని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. పంటను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టం వర్ణనాతీతం. పంట పొలాల్లో నీటిని తొలగించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కౌలు చెల్లించి పంటకు ఉన్నదంతా పెట్టిన కౌలు రైతులు తమకు కలిగిన నష్టాన్ని తలచుకుని ఆవేదన చెందుతున్నారు. పంట ప్రస్తుతం కంకి, పాలు పోసుకునే దశలో ఉంది. వర్షానికి కంకులు బరువెక్కి పడకేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నీరు నిల్వకుండా చూసుకోవాలి



సాధ్యమైనత మేర వర్షపు నీరు పంట పొలంలో నిల్వ ఉండకుండా బయటకు పోయేలా చూసుకోవాలి. రైతులు తగు సూచనలు పాటిస్తే ఉప ద్రవాన్ని అధిగమించవచ్చు. ఈ ఏడాది వివిధ విధానాల ద్వారా రైతులు పంటలను వేశారు.

– జి.మీరయ్య, వ్యవసాయ శాఖాధికారి, భట్టిప్రోలు

వర్షంతో స్తంభించిన జనజీవనం



జల దిగ్బంధంలో భట్టిప్రోలు విరలేశ్వరనగర్ కొత్త కాలనీ



రేపల్లెలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద నిలిచిన వర్షపునీరు

భట్టిప్రోలు: ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో భట్టిప్రోలు మండలంలో ఆదివారం రాత్రినుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. అలాగే రహదారులన్నీ చిత్తడిగా మారాయి. ఈ వర్షాల ప్రభావంతో చేతివృత్తి దారులకు పనులు లేకుండా పోయాయి. భట్టిప్రోలులోని లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటికి జలమయమయ్యాయి. దీనికి తోడు కాల్వ కట్ట రహదారి అధ్వానంగా మారింది. భట్టిప్రోలులోని మార్కెట్ వెనుక జెండాచెట్టు బజారు, బీసీ కాలనీ, పంచాయతీ కార్యాలయం, రైల్వేస్టేషన్, అల్లూరు కాల్వకట్ట (ఎస్టీ కాలనీ) సమీపంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో దోమలు ప్రబలి వ్యాధులు వస్తాయేమోనని ప్రజలు భీతిల్లుతున్నారు.

ముందుకు కదలని చేనేత మగ్గాలు...

అల్పపీడన ప్రభావంతో మండలంలోని ఐలవరం, అద్దేపల్లి, భట్టిప్రోలు ప్రాంతాలలోని చేనేత వాడల్లో మరలా రెండవ మారు మగ్గాల సవ్వడి మూగబోయింది. గుంత మగ్గాలలో వర్షపు నీరు చేరడంతో మగ్గాలు నేసేందుకు వీలు లేకుండా పోయింది. మగ్గాల్లో నేత దిగినప్పటికీ మొల కట్టుకునేందుకు వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో చేనేత కార్మికులు ఖాళీగా ఉన్నారు.

భట్టిప్రోలులో 32.2 మి.మీ వర్షపాతం..

భట్టిప్రోలులో 32.2, అమృతలూరులో 2.0, వేమూరులో 17.8, చుండూరులో 3.8, కొల్లూరులో 10.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది.

రేపల్లెలో జోరువాన

రేపల్లె రూరల్: అల్పపీడన ప్రభావంతో నియోజకవర్గంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షంతో నియోజకవర్గంలోని పలు రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారుల్లో సైతం వర్షపు నీరు నిలవడంతో వాహన చోదకులు, పాదచారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలోని నిజాంపట్నం రోడ్డు, బస్టాండ్ సెంటర్, నేతాజీ నగర్, రైలుపేట, పలు రహదారులలో వర్షపు నీరు నిలిచింది.

వర్షపాత వివరాలు..

ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు రేపల్లెలో 20.2 మిల్లీమీటర్లు, నిజాంపట్నంలో 10.8, నగరంలో 24.2, చెరుకుపల్లిలో 25.2 మి.మీ వర్షపాతం నమోదయ్యింది.

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు..

తుఫాను హెచ్చరికలతో రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామని ఆర్డీఓ రామలక్ష్మి తెలిపారు.

రేపల్లె ఆర్డీఓ కార్యాలయం: 08648 293795
రేపల్లె తహసీల్దార్ కార్యాలయం: 95053 22959
నగరం : 9676429878
నిజాంపట్నం: 70364 56786
చెరుకుపల్లి: 72073 96800
అమర్తలూరు: 90322 88125
భట్టిప్రోలు: 83319 13995
కొల్లూరు: 7794894544
చుండూరు: 6281216437
వేమూరు: 7893929411

పెద్దల సినిమాలకు పిల్లల్ని అనుమతించడం నేరం

మా-ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: 'ఎ' సర్టిఫికేట్‌తో విడుదల అవుతున్న సినిమాలు పెద్దలకు మాత్రమేనని, అయితే వాటిని తల్లితండ్రుల పర్యవేక్షణలో పిల్లలు చూడవచ్చని సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు 'యూ/ఏ' సర్టిఫికేట్లను జారీ చేయడం నేరపూరిత చర్య అని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్(మా)-ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. 'ఎ' సర్టిఫికేట్ సినిమాలు చూడటం వల్ల ఆ ప్రభావం 18 ఏళ్లలోపు పిల్లల జీవితాలపై తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. తెనాలిలోని 'మా-ఏపీ' కార్యాలయంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. 'యు' సర్టిఫికేట్ సినిమాలను ఎవరైనా చూడొచ్చని, 'ఎ' సినిమాలు పెద్దలకు, 'ఎస్' సర్టిఫికేట్ సినిమాలను కేవలం డాక్టర్లు, సైంటిస్టులకు పరిమితం చేస్తూ సెన్సార్ నిబంధనలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో 'యూ/ఏ' పేరుతో 'ఎ' సినిమాలకు పిల్లలను అనుమతించడాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. వినోదపన్ను 30 శాతం మినహాయింపు కోసం కొందరు 'యూ/ఏ' సర్టిఫికేట్లను లంచాలు ఇచ్చి తెచ్చుకుంటున్నారని గతంలో 'కాగ్' ఆక్షేపించిందని పేర్కొన్నారు. ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ 'యూ/ఏ' సర్టిఫికేట్ సినిమాలకు పిల్లలను అనుమతించడంపై ప్రజాప్రయోజనాల చట్టం మేరకు సెన్సార్ బోర్డ్‌పై హైకోర్టులో కేసు వేస్తామని తెలిపారు. నటుడు మిలటరీ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా మద్యం దుకాణాల కేటాయింపు

తెనాలిరూరల్: తెనాలి ఎక్సైజ్ కార్యాలయ సర్కిల్ పరిధిలోని 25 షాపులకు లాటరీ ద్వారా నిర్వాహకులను ఎంపిక చేసే ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం తెలిపారు. గుంటూరులో జరిగిన లాటరీ ప్రక్రియలో ఎటువంటి గంగదరగోళం లేకుండా పారదర్శకంగా పూర్తి చేయగలిగి దుకాణాల కేటాయింపు చేశామని చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో 25 షాపులకు గాను మొత్తం 552 అప్లికేషన్లు దాఖలయ్యాయి. తెనాలి టౌన్‌లో 11 షాపులు, తెనాలి రూరల్ మండలంలో 5 షాపులు, కొల్లిపర మండలంలో 4 షాపులు, దుగ్గిరాల మండలంలో 5 షాపుల చొప్పున దరఖాస్తులు చేసుకున్న వారికి లాటరీ ద్వారా వచ్చిన పేర్ల ఆధారంగా షాపుల కేటాయింపు చేశారు. లైసెన్సు ఫీజులో వ వంతు చెల్లించి దుకాణాలను 16వ తేదీ నుండి నిర్వహించుకోవచ్చని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మాజీ ఎంపీపీ చిట్టెమ్మ మృతి



పమిడి చిట్టెమ్మ(ఫైల్)

కర్లపాలెం: పెదగొల్లపాలెం మాజీ సర్పంచ్ పమిడి వెంకటేశ్వర్లు భార్య కర్లపాలెం మాజీ ఎంపీపీ పమిడి చిట్టెమ్మ(75) సోమవారం మృతి చెందారు. ఆమె కుమారులు చింతాయపాలెం సొసైటీ మాజీ చైర్మన్ పమిడి రవీంద్ర, పమిడి రాధాకృష్ణలను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు, పలువురు నాయకులు పరామర్శించి సానుభూతి తెలిపారు. చిట్టెమ్మ భౌతికకాయానికి మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

పెరవలి పంచాయతీ కార్యదర్శి మృతి



శ్రీనివాసరావు (ఫైల్)

వేమూరు: పెరవలి పంచాయతీ కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు (52) మృతి చెందాడు. అనారోగ్యంతో గత పది రోజులుగా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎంపీడీఓ శ్రీమన్నారాయణ తెలిపారు. వేమూరు మండలంలో చావలి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ బదిలీపై చావలి నుంచి పెరవలి కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన భౌతికకాయానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. శ్రీనివాసరావుకు భార్య, కుమార్తె ఉన్నారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు స్వాధీనం

వేమూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకోవడం జరిగిందని ఎస్‌ఐ రవికృష్ణ తెలిపారు. కొల్లూరు మండలానికి చెందిన కొందరు వ్యక్తులు ఆదివారం రాత్రి ఇసుక తరలిస్తుండగా, దాడి చేసి, ఐదు ట్రాక్టర్లు పట్టుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా శోంఠికరణ, ఆజేటి శ్రీమన్నారాయణ, ఇంటూరు ఏసుపాదంలకు చెందిన ట్రాక్టర్లు పట్టు కోవడం జరిగిందన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

చివలూరు(కొల్లిపర): మండలంలోని చివలూరు గ్రామంలో పేకాటస్థావరంపై దాడిచేసి 8 మందిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు సోమవారం చెప్పారు. గ్రామంలో ఇంటిలో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేయగా డబ్బుతో కోతబండి పేకాతున్న 8 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.37,420 నాలుగు మోటార్ బైక్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కోటేశ్వరరావు చెప్పారు. దాడిలో కానిస్టేబుల్ నాగరాజు, అశోక్, ఆర్ రాజేష్ ఉన్నారు.

సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆరు అర్జీలు



తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు మొత్తం ఆరు అర్జీలు వచ్చాయి. సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారిణి సుధాకిరణ్మయి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత గడువులోగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శం కావాలి



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పిస్తున్న దళత నాయకులు

చెరుకుపల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ఆచరించాలని అంబేడ్కర్ యువజన సంఘ నాయకుడు విజయ్‌రాజు పేర్కొన్నారు. మండలంలోని కావూరు గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మూడో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. విజయ్‌రాజు మాట్లాడుతూ అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ దళితులు, మహిళలు, కార్మిక హక్కుల కోసం భారతరత్న అంబేడ్కర్ ఎన్నో పోరాటాలు చేశారని, దేశంలో అన్ని మతాలకు, కులాలకు, అన్ని తెగలకు సమన్యాయం జరిగేలా వారిహక్కులకు భంగం వాటిల్లకుండా ముందుచూపుతో రాజ్యాంగాన్ని రూపొందించిన గొప్ప మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో దళత నాయకులు తురిమెళ్ళ శ్రీధర్, బడుగు చంద్రపాల్, మంచాల విజయ్‌కిషోర్, కర్రా ప్రతాప్, గ్రామ అంబేడ్కర్ యూత్ బడుగు రాజు, తురిమెళ్ళ నాగేంద్రబాబు, గర్నెపూడి సన్ని, తురిమెళ్ళ పృధ్వి, గుడుమాటి చిన్నా, పిల్లి అంజయ్య, గుర్రాల కోటేశ్వరరావు, ఇసుకపల్లి శ్రావణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

భట్టిప్రోలు: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ఎంతో లాభదాయకమని మాస్టర్ ట్రైనీ శివనాగేశ్వరమ్మ పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు, ఆకుకూరలు ప్రతి సోమవారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్‌లో విక్రయాలు నిర్వహిస్తున్నారు. శివనాగేశ్వరమ్మ మాట్లాడుతూ రైతులు తాము పండించిన పంటల దిగుబడులను మార్కెట్‌లో ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేసి విక్రయించడం ద్వారా రైతులు లబ్ధి పొందుతున్నారని తెలిపారు. రైతులు ఏ పంట సాగుచేసిన రసాయన ఎరువులు, పురుగు మందులపై ఆధార పడటమే కాక అధికంగా డబ్బులు ఖర్చుచేయాల్సి వస్తుందని తద్వారా అధిక రేట్లు వెచ్చించి కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వీటిని అధిగమించేందుకు ప్రకృతి వ్యవసాయ దిగుబడులు కొనుగోలు చేయడం శ్రేయస్కరమన్నారు. ఈ స్టాల్ ప్రతి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పని చేస్తుందని తెలిపారు. స్టాల్‌లో కూరగాయలు, ఆకు కూరలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. పురుగు మందు రహిత కూరగాయలను మాత్రమే ఈ స్టాల్‌లో విక్రయించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

'పల్లె పండుగ'తో గ్రామాల అభివృద్ధికి శ్రీకారం

రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి



కుచ్చెళ్లపాడులో సీసీరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు

చెరుకుపల్లి: గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందుకే ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తుందని రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి అన్నారు. మండలంలోని చెరుకుపల్లి, రాంబొట్లవారి పాలెం, కుంచలవారిపాలెం గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెరుకుపల్లిలో రూ.20లక్షలు, రాంబొట్లవారిపాలెం రూ.15లక్షలు, కుంచలవారిపాలెం రూ.13లక్షలు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ సుభాని, ఈఓపీఆర్డీ కేజీపీ శ్రీనివాసన్, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, మల్లాది రామకృష్ణ పాల్గొన్నారు.

రేపల్లె రూరల్: పల్లె పండుగ – పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పేటేరు, కారుమూరు గ్రామాలలో ఎంపీడీఓ ఎం.శోభారాణి సోమవారం భూమిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వేమూరు: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం వేమూరు మండలంలోని పలు గ్రామాల్లో సీసీరోడ్లకు ఆయన శంకుస్థాపన చేశారు. చుండూరు మండలంలోని యడపల్లిలో, అమర్తలూరు మండల కేంద్రంలో, వేమూరు మండలంలోని కుచ్చెళ్లపాడు, వెల్లబాడు గ్రామాల్లో రోడ్లకు శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు దండే సుబ్బారావు, జొన్నలగడ్డ విజయబాబు, వివిధ గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మినీగోకులం షెడ్డుకు భూమిపూజ

గొరిగపూడి(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం గొరిగపూడి గ్రామంలో సోమవారం పల్లె పండుగ-వారోత్సవాలలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద నిర్వహించనున్న పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో రూ. 2.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న మినీ గోకులం షెడ్డుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన నిర్వహించారు. ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, ఎంపీడీఓ ఎస్‌వీ రమణ, ఈఓపీఆర్డీ టి.ఊహారాణి, ఏపీఓ శివ పార్వతి పాల్గొన్నారు.

యువ వైఖానస అసోసియేట్స్ ఆరంభం

కన్వీనర్‌గా డాక్టర్ అనిల్ కుమార్



యువ వైఖానస అసోసియేట్స్‌ను ప్రారంభిస్తున్న దీవి లక్ష్మీ నరసింహాచార్యులు

తెనాలి: శ్రీవైఖానస సేవాసంఘం, తెనాలికి అనుబంధంగా యువ వైఖానస అసోసియేట్స్ ఆరంభమైంది. స్థానిక గంగానమ్మపేటలోని వేణుగోపాలస్వామి దేవస్థానం ప్రాంగణంలో సోమవారం సేవాసంఘం గౌరవాధ్యక్షుడు, 'వైఖానస ఆగమబ్రహ్మ' దీవి లక్ష్మీ నరసింహాచార్యులు నూతన విభాగాన్ని ప్రారంభించారు. కన్వీనర్ గా డాక్టర్ నారాయణ అనిల్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15 మంది కో-కన్వీనర్లుగా నియమితులయ్యారు. సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ మేడూరు శ్రీనివాసమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైఖానస యువతీ యువకులను అసోసియేట్స్‌లో సభ్యులుగా చేర్చి వారి ద్వారా వైఖానసులకు 15 అంశాలతో కూడిన సేవలను అందించేందుకు నిర్ణయించారు. సేవా సంఘం కోశాధికారి దీవి యోగానంద చక్రవర్తి, అర్చక సమాఖ్య రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.అనంతాచార్యులు, వైఖానస దివ్య సిద్ధాంత వివర్ధనీయ సభ తిరుమల ఉపాధ్యక్షులు నారాయణం వేణుగోపాల్, టీటీడీ ధార్మిక విభాగం ప్రాంతీయ కన్వీనర్ రొంపిచర్ల కిరణ్‌కుమార్, వివేకానంద విద్యాసంస్థల ప్రిన్సిపల్ దీవి రాధాకృష్ణమాచార్యులు, దీవి శ్రీనివాస దీక్షితులు, సంఘ ఉపాధ్యక్షులు తమిరిశ హరిబాబు, అసోసియేట్స్ సభ్యులు రొంపిచర్ల ఆనంద్, తమరిశ విష్ణువర్ధన్ శ్రీకాంత్ ,యశ్వంత్, తమిరిశ సాయి, వేదాంతం రాము, శ్రీభాష్యం సాకేత్, దీవి సింధు సంతోష్ కుమార్ తదితరులు మాట్లాడారు. మంచి సంకల్పంతో ప్రారంభించిన అసోసియేట్స్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైఖానసులకు తమ వంతు సేవలను అందిస్తామని చెప్పారు. నవంబర్ 24న అసోసియేషన్ ప్రత్యేక సమావేశాన్ని తెనాలిలో ఏర్పాటుకు తీర్మానించారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ తమిరిశ రఘు, ప్రధాన కార్యదర్శి వేదాంతం మాధవ కుమార్ పర్యవేక్షించారు.

మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు



న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న రిసోర్స్ పర్సన్ ఎస్పీ ఝాన్సీ

తాడేపల్లి రూరల్ : దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్ ఎస్పీ ఝాన్సీ, రహమాన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటు చేశామని, ఇందులో భాగంగా మహిళలకు చట్టాలు, ప్రత్యేక స్థానాలు, ప్రభుత్వ సహాయ సహకారాలు ఏ విధంగా ఉంటాయో వివరించామని తెలిపారు. ప్రతి మహిళా చట్టాలను తెలుసుకుని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ చంద్రమోహన్, మండల లీగల్ కమిటీ సభ్యులు మహబూబ్, పాల్గొన్నారు.